# మానవ స్వరం

మనం మనిషిని చూసి
ప్రక్కకు పోతున్నపుడు
వాడి తాలూకు భావ పరంపరలను
ఈగలను తోలినట్లు తోసుకెళతాయ్
పలకరింపుకే నవ్వినా
పలకరింపుకే తుమ్మినా
పలకరింపుకే ఉమ్మినా
మనిషి మొఖంలో గుండా ప్రయాణిస్తూనే
మనసును ప్రక్కదార్లు పట్టిస్తాం
నీవు వెయ్యతగిందేమేనా ఉంటే
మనిషి భుజం మీద కాక
మనిషి మాట మీద వెయ్యేసి చూడు
ఎన్ని వంకరలో తిరిగిన
వాడి ఆలోచన తీగకి
నీ వెక్కడన్నా మొగ్గగానో, ముల్లు గానో
తగులుతావేమో పరిశీలించు
నిర్లిప్తపు కోణాకారపు చెట్లు



అందరి భుజాలపై ఊగుతున్నపుడు
మాట్లాడే మనిషి
మర్మాల పుట్ట కదిలినట్లనిపిస్తాడు
భ్రమల నిధి దాచినట్లనిపిస్తాడు
మనిషి వాస్తవ రేఖ అయినపుడు
మనసెందుకో వాస్తవాతీత క్రాంతి
కావాలనుకొంటుంది
అందుకే
మనిషి నాడి మేఘంలా ఉరిమినపుడు
మనసు రక్త స్పర్శ మెరపౌతున్నపుడు
ఆ క్షణంలోనే
మనిషిని చూసి పలకరించు
మనిషిని చూసి ఆవహించు
మనిషి నుంచి మనిషి దాకా
ప్రయాణించాల్సినపుడు
మౌనం అగాథాన్ని దాటాలనుకున్నపుడు
మాట స్వగతాన్ని వీడాలనుకున్నపుడు
మనిషిని కేంద్ర బిందువుని చేసి
మనసు వృత్త పరిధిని పెంచుతూ పోవాలి

— మల్లంపల్లి విజయకుమార్

# ఉభయ చరాలు



''ఏమండోయ్, ఇవాల్టి పేపర్ చూశారా! మందూరులో జరిగిన ఘోరం చాలా దారుణంగా వుంది కదూ?''

''దారుణమా? మహా దారుణమా? అదేంటండీ పాపం వాళ్ళను వెంటాడి నరికి చంపడమా?''

''వెంటాడి నరకడమేనా? నరికి ముక్కలుచేసి, గోతాలల్లో కుట్టి, కాల్వల్లో పడేసి...''

''అబ్బబ్బ! మరింక చెప్పకండి, భరించలేం''

''ఇంతకూ ఆ ఊరోళ్ళకు వాళ్ళ మీద అంత కసెందుకంటారు?''

''అగ్రవర్ణ అహంకారమండీ... అదీ! వేరే కసేముంది అంతకన్నా? మేమే చదువుకోవాల, మేమే ఉద్యోగాలు చేయాల, మాకే ఆస్తులుండాల... అదీ''

''ప్రభుత్వమేమన్నా చేస్తుందంటారా?''

''ఆ... ఏం చేస్తుందండీ? దేశంలో ఇంతకుముందు జరిగిన వాటికంతా ఏం చేసిందీ? అసలు ప్రభుత్వమేమన్నా చేసేట్టుంటే వాళ్ళింతకు తెగిస్తారా?''

''అవున్లెండి, ప్రభుత్వం అగ్రవర్ణాలవాళ్ళదే కదా వాళ్ళకెందుకు వ్యతిరేకంగా వుంటుంది?''

''ఏమైనా మహా దారుణమండీ...''

''దారుణమా? దారుణమా? మహా...''

* * *

''చూశారా, మందూర్లో ఏం జరుగుతూ వచ్చిందో ఇప్పుడు బయటపడుతోంది. వీళ్ళేం తక్కువ్వాళ్ళ కాదండీ''

''అవునవును, అగ్రవర్ణాలవారి అమ్మాయిల్ని అల్లరిపెట్టడం...''

''అల్లరిపెట్టడమేకాదు, అంతకన్నా ఎక్కువే జరిగాయట! పాపం! ఎలా చెప్పుకుంటారు అటువంటివాటిని?''

''బయటివాళ్ళకివన్నీ ఎలా తెలుస్తాయి? ఏదో నరికేశారు చంపేశారు అంటే మామూలుగానే 'అయ్యో! పాపం' అనుకుంటాం''

''అంతేగదా. లేకపోతే ఎంత అగ్రవర్ణాల వాళ్ళైనా మనుషులుకదండీ... ఊరికే నిష్కారణంగా నరికి చంపేస్తారా?''

''చంపరు, చంపరు. చంపలేరు కూడా. అలా నరికి చంపి, ముక్కలు చేశారంటే వాళ్ళకెంత కసి వుండాలో, అందుకు ఎంత బలమైన కారణాలుండాలో ఆలోచించండి''

''ఇప్పుడు తెలుస్తోన్నాయి కదా, అంతకన్నా బలమైన కారణాలేంకావాల?''

''న్యాయమన్నాక అందరికొకటే. వాళ్ళు అన్నాళ్ళుగా బాధలుపడుతుంటే పట్టించుకోకుండా వుండి ఇప్పుడు ఘోరం ఘోరం అనరిస్తేనూ, ఆస్తులు జప్తు చేస్తామంటేనూ సరిపోయిందా?''

''ప్రభుత్వం వాళ్ళ ఓట్ల కోసం వాళ్ళ వైపే మాట్లాడాల గదండీ''

''అయినా వాళ్ళకేం పొయ్యేకాలమండీ. అగ్రవర్ణాలవారి అమ్మాయిల్ని అల్లరిపెట్టడమెందుకు? వాళ్ళనందర్నీ రెచ్చగొట్టడమెందుకు? కూలీ నాలీ చేసుకుంటూ వాళ్ళ పాటికి వాళ్ళు పడుండొచ్చుగా''

''పొగరండీ బాబూ, పొగరు! అంతకంటే ఇక వేరే పొయ్యేకాలమేముందీ? ప్రభుత్వం స్కాలర్‌షిప్పులిచ్చీ, రిజర్వేషన్లిచ్చీ కొమ్ముకాస్తోంది కదా. అందుకు వీళ్ళకు కొమ్ములు మొలిచాయి''

''కొమ్ములు మొలిచాయని కొండల్తో ఢీకొనడమే...''

''లేకపోతే ఆ ఊరు పుట్టి ఎన్నేళ్ళయిుంటుంది! ఎన్నడూ జరగంది ఇప్పుడెందుకు జరిగినట్టు!

* * *

ఉభయ చరాలనగా నీటిలోనూ నేలమీదా చరించగల జీవులని అర్థం. అయితే, ఆ జీవులకు ఒక చోట ఎక్కువగా చరించడం సహజంగానూ, మరో చోట చరించడం తాత్కాలికమైన అపద్ధర్మంగానూ వుంటుందనేది సైన్స్ తేల్చిన అంశం.

— రా